# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. దేశ చరిత్రలో తొలిసారి లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగనుండగా... ఎన్డీయే కూటమి తరపున ఓం బిర్లా, ఇండియా కూటమి తరపున కె.సురేష్ నామినేషన్ దాఖలు చేశారు.**

**2. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నాన్ని వినియోగించే విషయంలో 2018 నవంబరు 14వ తేదీన ఇచ్చిన గెజిట్‌లో పేర్కొన్న నిబంధనలను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

**3. ఉపాధ్యాయ అర్హత పరీక్ష..టెట్ ఫలితాలు ఈ రోజు విడుదల కానున్నాయి.**

**4. రాయలసీమ జిల్లాలకే పరిమితమైన రాగుల పంపిణీని జులై ఒకటవ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ అమలు చేస్తామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు.**

**5. టీ20 ప్రపంచ కప్‌లో ఉత్కంఠ భరితంగా జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై విజయం సాధించి ఆఫ్ఘానిస్తాన్ జట్టు సెమీ ఫైనల్‌కు చేరింది.**

==========================

దేశ చరిత్రలో తొలిసారి లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగనుంది. ఇప్పటి వరకు అధికార, విపక్ష సభ్యుల ఏకాభిప్రాయంతో లోకసభ స్పీకర్ ఎంపిక జరుగుతుండగా, తొలిసారి ఆ సంప్రదాయానికి భిన్నంగా ఎన్నిక జరగనుంది. అధికార-విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరని నేపథ్యంలో ఎన్డీయే తరపున ఓం బిర్లా నామినేషన్ దాఖలు చేయగా.. విపక్ష ఇండియా కూటమి తరపున కాంగ్రెస్ సభ్యుడు కె.సురేష్ నామినేషన్ దాఖలు చేశారు.

--------------------------

రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నాన్ని వినియోగించే విషయంలో 2018 నవంబరు 14వ తేదీన ప్రభుత్వం ఇచ్చిన గెజిట్‌లో పేర్కొన్న నిబంధనలను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అధికారిక చిహ్నంలోని మూలకాల వివరాలు.. చిహ్నం సైజు.. అందులో వినియోగించే రంగుల విషయంలో నిబంధనలు పాటించాలని, అన్ని ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, విభాగాల అధిపతులు, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. చిహ్నం ఎత్తు 24 మిల్లీ మీటర్ల కంటే ఎట్టి పరిస్థితుల్లోనూ తక్కువ ఉండకూడదని ప్రభుత్వం పేర్కొంది.

--------------------------

ఉపాధ్యాయ అర్హత పరీక్ష..టెట్ ఫలితాలు ఈ రోజు విడుదల కానున్నాయి. ఈ సంవత్సరం ఫిబ్రవరి 27వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు టెట్ నిర్వహించారు. 2 లక్షల 35 వేల మంది ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఫలితాలు మార్చి 14వ తేదీనే విడుదల కావాల్సి ఉండగా.. ఎన్నికల నియమావళి కారణంగా వెల్లడించలేదు. టెట్‌లో అర్హత సాధిస్తేనే డీఎస్సీ రాసేందుకు అర్హులు కావడం, డీఎస్సీలో టెట్ మార్కులకు 20శాతం వెయిటేజీ ఉండటంతో ఈ ఫలితాలు అభ్యర్థులకు కీలకంగా మారాయి.

---------------------------

రాయలసీమ జిల్లాలకే పరిమితమైన రాగుల పంపిణీని జులై ఒకటవ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో చేపడతామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు. బియ్యానికి బదులుగా గరిష్ఠంగా మూడు కిలోల వరకు రాగులు అందిస్తామని ఒక ప్రకటనలో వెల్లడించారు. రాయలసీమలోని అయిదు జిల్లాల్లో మాత్రమే అందిస్తున్న జొన్నలను మిగిలిన మూడు జిల్లాల్లో కూడా అందించనున్నామని కమిషనర్ పేర్కొన్నారు.

---------------------------

పొగాకు అదనపు పంటపై విధించే అపరాధ రుసుమును రద్దు చేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి.. కేంద్ర వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్‌కు విజ్ఞప్తి చేశారు. నిన్న ఢిల్లీలో ఆమె.. పొగాకు రైతు ప్రతినిధులతోపాటు కేంద్రమంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఇందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పురందేశ్వరి తెలిపారు. ఇది రాష్ట్ర పొగాకు రైతులకు చాలా మేలు చేస్తుందని పేర్కొన్నారు.

---------------------------

వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చాలన్నదే ప్రభుత్వ ప్రాధాన్య అంశమని, దీనికోసం రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సక్రమంగా అందేలా చూడాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా తీరుపై సచివాలయంలో నిన్న ఆయన ఉన్నతాధికారులు, డిస్కంల సీఎండీలతో సమీక్షించారు. పంటలను కాపాడుకోవడానికి ఉచిత విద్యుత్ పథకం ఉందన్న భరోసా రైతుల్లో కల్పించాలని సూచించారు. ఈ దిశగా శాశ్వత ప్రాతిపదికన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని కోరారు. అలాగే విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను డిస్కంలు అందించాలని.. తమ పరిధిలోని గిరిజన ప్రాంతాలన్నింటికీ డిస్కంలు విద్యుత్ సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

తిరుమలలో భక్తులకు కల్పిస్తున్న వివిధ రకాల దర్శనాలకు సంబంధించి పూర్తి నివేదిక రూపొందించాలని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతిగృహంలో నిన్న నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులకు కల్పిస్తున్న వివిధ రకాల దర్శనాలు, అందుకు సంబంధించిన దర్శన వేళలు ఏ దర్శనానికి ఎంత సమయం పడుతుందనే వివరాలను నివేదిక రూపంలో అందించాలని ఉప కార్యనిర్వహణాధికారి ఈవో లోకనాథంను ఆదేశించారు. ఉదయం సేవలు, వీఐపీ దర్శనం, సర్వదర్శనం, ఆర్జితసేవలు, ఇతర దర్శనాలపైనా ఈవో సమీక్షించారు. అంతకుముందు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్లను ఆయన పరిశీలించారు.

---------------------------

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్..యూజీసీ–నెట్ పరీక్షను రద్దు చేయడంతో పాటు, నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ దర్యాప్తునకు ఆదేశించడాన్ని విద్యారంగ నిపుణులు స్వాగతిస్తున్నారు. పరీక్షల రద్దు, దర్యాప్తు విషయంలో కేంద్ర విద్యాశాఖ తీసుకున్న చర్యలు, పారదర్శక నిర్ణయాలతో విద్యార్థులకు మేలు జరుగుతుందని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కె.ఎం.సత్యనారాయణ ఆకాశవాణికి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిన క్రమంలో విద్యార్థులు సంయమనంతో వ్యవహరించాలని ఆయన సూచిస్తూ..

...వాయిస్ .. 28 సెకన్లు

---------------------------

టీ20 ప్రపంచ కప్‌లో సంచలన విజయాలతో కొనసాగుతున్న ఆఫ్ఘానిస్థాన్ సెమీ ఫైనల్‌కు చేరింది. సూపర్–8లో మూడు జట్ల భవితవ్యం తేల్చే చివరి మ్యాచ్ ఈ ఉదయం ఉత్కంఠభరితంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్ఘానిస్థాన్ 5 వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసింది. వర్షం కారణంగా డక్‌వర్త్‌లూయిస్ పద్ధతి ప్రకారం మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదించి, లక్ష్యాన్ని 114 పరుగులుగా నిర్ణయించారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన బంగ్లాదేశ్‌ను 17.5 ఓవర్లలో 105 పరుగులకే ఆఫ్ఘానిస్థాన్ ఆలౌట్ చేసింది. కాగా.. ఆఫ్ఘాన్ విజయం సాధించడంతో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ జట్లు టోర్నీ నుంచి వైదొలిగాయి. సూపర్–8 గ్రూప్ 1 నుంచి భారత్‌తో పాటు అఫ్ఘానిస్థాన్ నాకౌట్ స్టేజ్‌కు చేరింది. ఎల్లుండి ఉదయం 6 గంటలకు దక్షిణాఫ్రికాతో తొలి సెమీస్‌లో అఫ్ఘానిస్థాన్ పోటీపడుతుంది. అదే రోజు రాత్రి 8 గంటలకు భారత్–ఇంగ్లాండ్ జట్ల మధ్య రెండో సెమీఫైనల్ జరగనుంది.

---------------------------

ప్రముఖ భాషా శాస్త్రవేత్త, సాహితీ విమర్శకులు వఝల చిన సీతారామ శాస్త్రి జయంతి ఈరోజు. 1878 జూన్ 26వ తేదీన విజయనగరం జిల్లా పాలేరు గ్రామంలో జన్మించిన ఆయన.. పలు శాస్త్రాలను అభ్యసించి ఎన్నో రంగాలలో కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి, ద్రవిడ భాషల పరిశీలన, అధ్యయనం తదితర అంశాలలో విస్తృత స్థాయిలో కృషి చేశారు. ఆయన కుటుంబమంతా విద్వత్ కుటుంబంగా పేరు గాంచింది. చిన సీతారామ శాస్త్రి...... సంస్కృతం, వ్యాకరణం ధర్మ శాస్త్రాలు ఔపోసన పట్టారు. ద్రవిడ భాషల స్వభావ, సారూప్యాల పరిశీలనలో అపారమైన కృషి చేశారు. ఆయన భాషా పటిమకు గుర్తింపుగా "వ్యాకరణాచార్య", "కళా ప్రపూర్ణ" వంటి బిరుదులు వరించాయి.

---------------------------

కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు జాతీయ రహదారిపై ఈ ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు మృతి చెందారు. టమోటా లోడ్‌తో వెళ్తున్న లారీ టైర్ పంచర్ కావడంతో ఉంగుటూరు జాతీయ రహదారిపై నిలిచిపోయింది. ఆ వాహన డ్రైవర్ టైర్ మార్చేందుకు మరో వాహన డ్రైవర్ సహాయం చేస్తున్నారు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన సిమెంట్ లోడ్ లారీ టమోటా లోడ్ లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో టైర్ మరమ్మతులు చేస్తున్న వారిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మరణించారు.

---------------------------

విజయవాడ డివిజన్‌లో ఆధునికీకరణ పనుల కారణంగా రద్దు చేసిన రైళ్లలో కొన్నింటిని పునరుద్ధరించినట్లు దక్షిణ మధ్య రైల్వే  ఒక ప్రకటనలో తెలిపింది. జన్మభూమి, విజయవాడ-కాకినాడ పోర్ట్ రైళ్లను ప్రయాణికులకు మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. విజయవాడ- కాకినాడ పోర్టు  చెంగల్పట్టు- కాకినాడ పోర్ట్  మధ్య నడిచే రైళ్లను పునరుద్ధరించినట్లు పేర్కొంది. వీటితో పాటు రద్దీని తగ్గించేందుకు తీసుకొచ్చిన  నర్సాపూర్ హైదరాబాద్, సికింద్రాబాద్ తిరుపతి, లింగంపల్లి కాకినాడ వంటి పలు ప్రత్యేక రైళ్లను జూలై 1 వరకు నడుపుతున్నట్లు వెల్లడించింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన భావాలను దేశ ప్రజలతో పంచుకునే మనసులో మాట  మన్ కీ బాత్ కార్యక్రమం 111వ సంచిక  ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి మన్ కీ బాత్ కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల 28వ తేదీలోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ లేదా మై గౌవ్ ఫోరమ్, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

======================